


# గురితప్పిన ఉరి

కథానిక

ఒక్క క్షణం కనుమరిగితేచాలు నర్సయ్య ప్రాణం టుప్పున ఎగిరిపోను! ముందుకు వొచ్చుకొచ్చిన దూలానికి చేంతాడు వేలాడదీసి, పీక్కి ఉరేసుకోబోతున్నాడు. ఎంత జాగ్రత్తపడ్డా, ఎవరికంట పడిందోగాని పదిమందీ గబగబలాడుతూ వచ్చి నర్సయ్య గుడిసెముట్టేశారు. గూడెంగూడెమంతా కక్కదలిపోయింది.

ఐనా మనిషంత మనిషి, నర్సయ్యగాడికిదేం పొయ్యేకాలమన్నవాళ్లే నలుగురూ! ఇంత అఘాయిత్యానికి తలపడ్డ మొనగాడు ఏమైనా చేసేస్తాడు.

ఆవేళ పశువుల సంతమూలాన, పాపయ్యమ్మ రెండుగంపలేసుకొని, కోడికూ సేముందే బయల్దేరి పోయింది, పేడేసుకునేందుకు— అదిలేని అదను కనిపెట్టి— నర్సయ్యకాస్తా ఆ గుక్కెడు ప్రాణానికి ఉరి తగిలించుకోబోయాడు.

తాడు తాడులాగే వుంది. నర్సయ్య మెడ కొంచెం రాచుకుపోయింది. ఓడిపోయిన బ్రతుకులా వాడిపోయి తల క్రిందికి దించేసుకొన్నాడు. వగురుస్తూ, పెద్దచప్పుడు చేసుకుంటూ ఊపిరి పీలుస్తున్నాడు.

చుట్టూపాతికమున్నైమంది చుట్టుముట్టేశారు. గూడెంలో పలుకుబడిగల ఆసామి నారయ్యకాపు బొంగురుగొంతుతో... "ఏందిరా అది? ఆగాయిత్తెం? నిండుపేనాలు తీసేసుకోబోతుండావు? ఇట్టాగట్టాసేస్తే గూడానికి సెడ్డపేరొత్తది. ఆమయిన్ని సూసుకో... నిన్నూ నీ పెళ్ళాన్నీ ఆతలికి తగిలేత్తే...కుయ్యో మొర్రోమంటూ నిలిసే నీడలేక అల్లాడిపోతరు. ఆమయాన్ని జాగర్త"— గుడ్లురుముతూ పులిలా గర్జించాడు. నర్సయ్య నకనకలాడుతూ ఓ పక్కకి ఒదిగిపోయాడు.

వెధవప్రాణాలు పోక నేపాయ్యాయిగావూ? అటు చావూలేదు... ఇటుబతకనూలేదు... చావు బతుకులమధ్య వేలాడుతూ ఉరిత్రాడు తలనించి తెగిపోయింది. నలుగురూ నవ్వుతూ గేలి చేస్తున్నారు.—'సావలేనోడా! బతకలేనోడా!' అని-

నర్సయ్యనోట్లో నాలిక లేదు. ఎవరే అక్షింతలు వేసినా, తలొగ్గి వూరుకొన్నాడు. అరికాలికింది నించి, మెదడుదాకా నరాలు తెగపేలుతున్నాయి. గుండె గజగజ వణుకుతూ ఉంది. వళ్ళంతా చెమటపట్టి నీట్లోపడి కొట్టుకొచ్చి ఒడ్డునపడిన మనిషిలా వున్నాడు.

"పోరంబోకెధవా! పోలీసోళ్ళకి తెలిసినా దంటే జయిల్లో కూకుడుండబెడతారు. జాగర్తగా మసులుకో! ఏం? సావుగోరుకోడవేఁ?... తిని, కొవ్వెక్కి తిరగనేకనా? పెళ్ళాం కూకోబెట్టి వండిపెడతంటే...నీకెట్టాంటి ఆలోసెన్లు ఎక్కుతున్నాయిరా!..."

కులంపెద్ద పిల్లెంకడికి వళ్ళుమండి అన్నాడు. ఔనుమరి!... కూచోబెట్టే తినబెడుతోంది పాపయ్యమ్మ! అంతా నర్సయ్య ముఖంమీద తుప్పున ఉమ్మేస్తున్నారు.

"ఏరా నర్సయ్యా ఎవరేమన్నారని సస్తన్నా

దో. వెం. ర.

వురా?" ఎవరో అడిగారు గుంపులోంచి... పిల్లల్నించి పెద్దల దాకా పకపక నవ్వారు! వేలాడుతోన్న చేంతాడువైపు చూశాడు నర్సయ్య. గుండెలో రక్తం పారే నరంలావుంది.

నర్సయ్యకీమధ్య జబ్బుచేసినప్పట్నుంచీ పనిలోకి వెళ్ళడంలేదు. పాపయ్యమ్మే పుల్లాపిడకా చేసుకుని, కూలికెళ్ళి కమ్మకెళ్ళి—కోడుపులూ కోతలూ...అన్నింటికి వెళుతూ రోజులెత్తుతోంది. జబ్బుచేసిన నర్సయ్య బక్కనరంలా తయారయాడు. ఇంకా ఎవరూ పనిలోకి రానీటంలేదు. రోజూ పాపయ్యమ్మ దెప్పిపొడుస్తోంది కడుపులో శూలంలా. ఆ బాధ భరించలేకనేమో... ఈ అఘాయిత్యానికి పూనుకొన్నాడు!

మళ్ళీ గుంపులోంచి జోట్లు పేల్చినట్టు పేల్చారు ప్రశ్నలు. "మూగినక్కలా మాటాడవేంరా? సావెందుగ్గోరుకున్నావురా?"

"నీ పెళ్ళాం ఏవండేటి? కూలికియ్యాలగాకపోతే రేపెల్తావు! అదేందైనాఅంటే, మొగోడివి గాదురా! దాంతో మనసు ఇరక్కి పడిపోయి, సత్తే పీడా ఇరగడైపోద్దనుకొన్నావా?"

"సావంటే తేలికట్రా? పదిమంది పాసి నోళ్లలోనూ నలుసైపోనావు. నీ బతుకుమండ!"

తిట్లూ దీవెనలూ గుంపులోంచి తెగతెంపులుగా వస్తున్నాయి, నర్సయ్య వంటిమీద గుత్తులు గుత్తులు గుండుసూదులు గుచ్చుతూ...

నాలిక పిడచకట్టుకుపోతోంది. గుండె తేలిపోయింది. కళ్ళల్లోంచి కారలేక కారలేక కన్నీళ్లు పడుతున్నాయి. ఒక్క పావుగంటలో యెంత లోకువైపోయాడీప్రపంచానికి! నలుగురూనాలుగు విధాలా అంటూ కన్నీళ్ళు తుడవడానికి ప్రయత్నిస్తున్నారు!

ఇప్పుడు తెలిసొస్తోంది తనెందుకు చావాలిసొచ్చిందో? ప్రపంచం పోకడ అద్దంలోలా అర్థమౌతోంది. ఇక పాపయ్యమ్మొచ్చి ఎన్నిచీవాట్లు పెడుతుందో లెక్కా పత్రంలేదు. ఒక్క నిమిషంలో తన పాపం బద్దలైపోయింది. తన మానవత్వం మంటగలిసిపోయింది. మానవుడెటువంటి క్లిష్టపరిస్థితుల్లో అయినా, ఏ క్షణంలో అయినా ఆత్మహత్య ప్రయత్నం చేసుకోవడానికి వీల్లేదు. అది మహాపరాధం! మానవజన్మనే అపహాస్యం చేయడం మృత్యువుని కోరి వరించటం!

నర్సయ్య గతుక్కుమనిపోయాడు. గుండె గొంతులోనే గిజగిజలాడుతోంది. శరీరంలోనరాలు ఆ పదార్థాన్ని లాగలేక లాగలేక పుటుక్కున తెగిపోతున్నాయి.

"పాపయ్యమ్మతోశేం సెపుతావ్రా?"

గుంపులోంచి భీకరంగా ప్రశ్న మొలిచింది. నర్సయ్య నెత్తిమీద పిడుగు పడింది. ఉరి వేసుకుంటే చచ్చిపోతాననుకొన్నాడుగాని, ఉరితప్పి, గురితప్పి పెద్దపులి మీదపడుతుందని అనుకోలేకపోయాడు.

"పిచ్చిముండావాడు!" నలుగురూ నిర్ధారణ చేశారు. ఇంతలో గుంపు తెగతెంపులైపోయింది. చీమ చిటుక్కుమన్నట్టులేదు. రెండుగా చీలిపోయింది. పాపయ్యమ్మొస్తోంది!... తనపాలిట మృత్యువులా...మృతిలా... చితిలా... ఎవరు? పాపయ్యమ్మే!

నర్సయ్య కళ్లు మూసేసుకున్నాడు. నేరం చేసిన చంటిపాపలా బిక్కుబిక్కుమంటున్నాడు. ఏంమాటలంటుందో? ఎన్నిరకాల చీవాట్లో?...

"నువ్వు సావగోరుకున్నావా?... సావనేక పోనావా? ఎందుకు బతికి ఉప్పూ సింతపండూ దండుక్కా?" అంది. మెలికలుతిరిగిన మృత్యువు నాలికల్లాంటి చూపులు చూచింది. ఆ చూపులో "నేను నీపాలిటి మహామృత్యువునైతే, నువ్వు వేరే మృత్యువుని వరించడం దేనికి?" అన్న అంతరార్థం ఇమిడి ఉండకపోదు!

"సూడండయ్యా, పెద్దమనుష్యులూ! యీ మొగుడూ మొద్దులూ ఏంపని చేశాడో? నిలువునా పేనాలు దీసేసుకొంటే ఏంది సెప్పండి? ఓ కట్టమొచ్చానా? నట్టమొచ్చానా? ఇప్పుడీతణ్ణెవరేవన్నారని ఇంత అగాయిత్తెం తలపెట్టినోడు. గూడెంగూడెవంతా గుండె బేజారెత్తిపోనాది... ఈడికేం నోటొచ్చిందని?... ఎందుకుసావడం? క్కాలానిక్కాలానికంతకీ సెడ్డపేరు గాదంటయ్యా? ఇలాంటోడ్ని సెమించి యిడిచిపెడితే, ఎలాంటిపనన్నా సేస్తాడు. ఈమొగుడు నాకొద్దు మొర్రో అంటావుంటే... మా అయ్యా, అమ్మ

యిాణ్ణి కట్టిపెట్టినోరు. నా నోరుపడ! యిా మొగుకు నాకొద్దు. నే నేరేయెల్లిపుంటా."

పాపయ్యమ్మ ఉపన్యాసం పదిమందిలోనూ తుపాను రేగించింది. ఒక్క ఊపు ఊగించింది. ఎంత బతుకుధైర్యంలేని ఆడదైతే అంత మాటం టుంది? నర్సయ్యబాకుకు నడివీధిలోచచ్చిన కుక్క పిల్లకంటే హీనమైపోయింది.

"ఏం నర్సయ్యా, ఏమంటావ్?" నలుగురూ మొహంమీద నే ఎగుర్కొన్నారు. "అది నిన్ని డిసి ఎల్లిపోతానంటున్నాది. ఇక వేరే యెవ్వర నన్నా సూసుకుంటాదంట. ఏటంటావ్?" అని.

నర్సయ్య ఏడుపుమొగం పెట్టేసి, బావురుమని చేతుల్లో మొగం ఇరికించుకొని ఏడ్చేశాడు

"ఇంతకంటె ఇతనికేం సేతగాదు." అంది పాపయ్యమ్మ.

"అదిగాదు. ఎందుకేడుత్తావంట. నిన్నెవరే వన్నారని? అది ఎల్లిపోతానంటే, మా టాడ వేందిరా?"

నర్సయ్యలోపల్లోపలే సణుక్కొంటూగుడ్లప్ప జెప్పి ఊరుకున్నాడు. నోట మాటపెగలటంలేదు. ఎంత కదిపినా కదలడు మెదలడు. గుండెమాత్రం వెయ్యిబీటలేస్తోంది.

రానురాను జనం పల్చబడిపోతున్నారు. చూరు కింద నలుగురో ఐదుగురో మాత్రం మిగిలారు. పాపయ్యమ్మ నేలకతుక్కుపోయిన గుమ్మంమీద గొంతుక్కూచుండిపోయింది కళ్ళల్లో గుండ్రంగా గుండ్రంగా నీళ్లు తిప్పుకొంటూను. అక్కణ్ణుంచి తను కాపురానికి వచ్చింది లగాయతు, ఆ నిమిషం దాకా జరిగిన నర్సయ్య చేసిననేరాలు వల్లించడం మొదలుపెట్టింది; అతనితత్వానికి తనతత్వం ఎలా అతకలేదో మనువుచేసుకొన్నప్పట్నుంచి, ఇప్పటి దాకా ఎలా సుఖపెట్టలేకపోయాడో సణిగింది గొణిగింది. ఏ అర్థరాత్రివేళన్నా లేచి పారిపోతా డేమో అని, ఒక్కనిమిషం కాపరం చేయలేనంది జంకుతూ గొంకుతూ...

నలుగురూ సద్దిచెప్పి వెళ్ళిపోయారు. మధ్యాహ్నము మూడుగంటల ప్రాంతంలో పొంగిన ఈ ఉదంతం, చీకటిపడేదాకా చల్లారలేదు. అప్పటి కప్పుడే సంజ ఎర్రగా రక్తం కక్కుకుంటూ, తెగిపడిన శిరస్సులా పోయింది.

పాపయ్యమ్మ అప్పటికప్పుడే గిన్నా గిరూ తెచ్చి కుండలో ఎసరు పడేసింది. కూరతరుగుతూ,

"ఉప్పూ, నూని సుక్కానేదు. ఎల్లితెత్తావా?" అంది. అప్పటికప్పుడే, "వద్దులే! నిన్ను పీనుగుని సూసినట్టు సూత్తారు. వడమటి గదిలో నూని కాయీ అదీ తెచ్చి పారనూకు"—అంది.

నర్సయ్య ఉసురోమంటూ లేచాడు.

"నేనే యెల్తాన్లే."

"ఎల్లేవులే! శని పీడనాగ ఏం మొగం ఎట్టుకుని ఎల్తావ్? నీ పీడనేకూలో! నేనే యెల్లొత్తా."

"ఎందుకొచ్చిన బతుకురా?" అని ఉసురు మన్నాడు నర్సయ్య. తన ఉసురూ ఊపిరీ—తన పెళ్ళాం పీల్చి విషపుగాలి విసురుతోంది. నోట్లో నాలికలేని చచ్చుముండావాణ్ణి చేసి ఆడిస్తోంది. తననోట్లో పట్టుమని పదిమాటలన్నా లేవు. ఎదిరించి పలకలేడు. నాలిక పీక్కున్నాడు కరుచుకున్నాడు. పిచ్చెక్కి జుట్టు లాక్కున్నాడు. కోపంతో గొంతు పిసుక్కోబోయాడు. ఆవేశం పట్టలేక పెద్దపెట్టున గొంతులోనే అరిచాడు.

పాపయ్యమ్మ చిల్లర దుకాణంమీద కెళ్ళి వచ్చేసింది. సీవెండిగిన్ని ముందుకుతోసింది. తనకి పిండాకూడు తింటున్నట్టుంది; చచ్చి బతికాడు. నోట్లోకి ఒక్క మెతుకన్నా వెళ్ళడంలేదు.

"మిరపగాయ నంజుకో అయేసెంమీదున్నావు. కడుపునిండా గంజితాగి, కడుపు సల్లార్చుకో. సెవటుట్టి హాయిగా నిదరడద్ది తొంగుందువుగాని."

నోట్లో ముద్దపెట్టాడు. తుభుక్కున ఊమ్మే శాడు. గొంతుదిగలేదు. ఉక్కిరి బిక్కిరయ్యాడు.

"అదేం? దిగటంనేదేంటి ముద్ద? నా సేతికూడు యిసమైపోనాది నీకు!"

మరోముద్ద పెట్టాడు బలవంతంగా కళ్ళు మూసుకు మింగాడు.

"జొన్లే! సచ్చిపోయేవాడికి తిండెందుకులే! మమ్మల్ని నువ్వు బతికి సంపకపోతే, ఏనూతిలో నన్నా పడిపోరాదూ?" అని బుగ్గమీదపొడిచింది.

నర్సయ్య గుండె హైరాను పడిపడి ఇక సహించలేకపొయ్యాడు. గుండె మాటమాటకి ఎగ తన్నుతోంది. గుండెమీద ప్రతీ పోరా ఘర్షణ చింపి, 'ఉఫ్' మని ఎగరవేస్తోన్నట్టుంది. తను చావ దలుచుకొంటే మధ్య పీక్లకెందుకూ? ఛీ...

చావుబతుకు! ... పెళ్ళాంచేత చావు చీవాట్లు! నర్సయ్య చెవిలో, 'చావు చావు' అనే పదం జోరీగలాగ గింగిరా లెత్తింది. 'ఈ చీవాట్లు తినేకంటే ఎవరూ చూడకుండా చచ్చిపోవా లనిపిస్తోంది. ఏం తప్పు? మొగుడు పెట్టే బాధలు పడలేక తాయారమ్మ వంటినిండా కిరసనాలు పోసుకుని చచ్చిపోలేదూ? పెద్ద కమతం దొరగారి బావమఱది, ఊరినిండా అప్పులు పెంటకుప్పల్లా చేసిపారేసి, పిస్తోలుతో కాల్చుకుని చచ్చిపోలేదూ? ఎంతమంది సొంతంగా చచ్చిపోవడం లేదు? తన బుర్రలో ఈ బుద్ధెందుకు అంకురిల్లిందో, దీని అంతు తేలాలి!

* * *

ఎంతసేపు దొర్లినా, సన్నని చినుకుపడ్డట్టున్నా కునుకు పట్టలేదు; పాపయ్యమ్మకి — నర్సయ్య చావలేక బతికాడు; తనా నర్సయ్యతో నానా హైరాను పడుతోంది. ఊరి గురితప్పిందిగాని, లేకపోతే ఈపాటికి అంతా పూర్తయిపోను. తను నిశ్చింతంగా బతికిపోను!

బాగా కళ్లు విప్పి చూసింది. మసక వెలుతురులో నీడలు జాడజాడలుగా కదిలినట్టుంది. కళ్ళని సూదుల్లా గుచ్చుతూ నీడని పదేపదే పరకాయించి చూస్తోంది కన్ను మూసుకొంటూ తెరుచుకొంటూ. గుండెలో గుబులుగుబులుగా భయం పొంగుతోంది. నీడ జరిగిపోతోంది గోడ నంటిపెట్టుకొని, అలా చూసిచూసి, రెండు నిముషాలు లేచి బయటికొచ్చింది. చీకటి గుయ్యారం, చుట్టుపక్క గుడిసెలన్నీ తల విరబోసుకొన్న దెయ్యాల్లా వున్నాయి. ఆ వాతావరణం ప్రతీ అణువులో భయం గజ్జెకట్టుకు తాండవిస్తోంది. నర్సయ్యని పిలిచింది. ఏవుంది? తుండు గుడ్డకూడా లేదు. నర్సయ్యక్కణ్ణుంచి వెళ్ళిపొయ్యాడా?

పాపయ్యమ్మ గుండెలు పిటపిటలాడాయి. తన నోరు బద్దలై అమాంతంగా కేకలు బాహిరిల్లాయి.

"ఓ రామయ్యన్నో, కామయ్య బాబో!" అని నలుగుర్నీ కేకలేసి, "నర్సయ్య మాఁవెళ్ళి పోనాడు యెదకండి, యెదకండి" అని యేడ్పు సాగించింది.

పదిమందీ లాంతర్లూ కర్రలూ తీసుకొని బయల్దేరారు. పాపయ్యమ్మ వాళ్ళవెంట పడింది. చుట్టుపట్టల గాలించేశారు గావు కేకలేసుకొంటూ.

పాపయ్యమ్మ ధైర్యం జారిపోయింది. ఇంటి మొగోడు విడిచి వెళ్ళిపోతే తనేంకావాలి? ఎలా గవాలి? ఇప్పుడు తనకెవరూ దిక్కు?.. నర్సయ్య నేదో ఆవేశంలో ఏం మాటలన్నా అది అప్పటి కప్పటి మాటలేగాని, ఇలా పారిపోతాడనుకొని అన్నావా?

"ఆడికేవఁన్నా బుద్ధున్నాదా? ఇందాకణ్ణుంచీ ఎన్నిసూరిపోసినా, ఆడి ఆలోచన మానాడు కాదు" పెద్దమనుషులు నలుగురు అన్నారు.

ఊరవతల మైలు దూరంలో గోదావరి జర జర పారుతోంది. అంతా దడదడ లాడుతూ బయల్దేరారు. కేకవేసుకుంటూ నర్సయ్యని సొంకేతిస్తూ పాపయ్యమ్మకూడా వాళ్ళందరితో వెర్రిగా పరుగెత్తింది. దిక్కులు పిక్కటిల్లేట్టు గావుకేకలు వేస్తున్నారు.

పాపయ్యమ్మ వలవలయేడుస్తూ "నా బతుకు గంగలో ముంచేసినావురా దేవుడా!" అని గోలెత్తిపోతోంది.

"ఇది నువ్వు నీచేత్తో చేసుకున్న ముప్పేనే! చేతులారా వాణ్ణి గంగలో తోశావు. ఆ నోట్లో నాలిక లేనివాణ్ణి పట్టుకొని అల్లాడించేశావు. ఇప్పుడనుభవించు"— అని మొహంమీద ఉమ్మేసి నలుగురూ వెళ్లిపోయారు.

నక్షత్రాల గుడ్డివెల్తురులో పాపయ్యమ్మ ఇంకా ఆ నిర్భాగ్యుడికోసం వెదుకుతోనేవుంది.

---

జడ్జి (ముద్దాయితో): నీ భార్యను కొట్టడానికి ఏ పరిస్థితులు నిన్ను పురిగొల్పాయి?

ముద్దాయి: ఆమెగారు అటువైపు తిరిగి ఉండడం, కర్ర దగ్గిరలోనే ఉండడం, నా వెనకాల పెరటి తలుపు తెరుచుకొని ఉండడం.